సమష్టి కృషితోనే అధిక కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రాజేశ్‌బాబు

కందనూలు, న్యూస్‌టుడే : జాతీయ లోక్‌అదాలత్ పురస్కరించుకొని డిసెంబర్ నెలలో నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్ కార్యక్రమంలో అధిక కేసులు పరిష్కారం కావడానికి న్యాయవాదులు, పోలీసు సిబ్బంది కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రాజేశ్‌బాబు అన్నారు. పట్టణంలోని జిల్లా న్యాయస్థానంలో శనివారం డిసెంబర్ నెలలో నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో 13,762 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిలో భూతగాదాలకు సంబంధించి 6,236 కేసులు 7,526 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. సెప్టెంబర్‌లో నిర్వహించిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో 20,071 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. ఇరువర్గాల కక్షిదారులను రాజీకుదిర్చి అధిక కేసులు పరిష్కరించడానికి పోలీసు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లోక్‌అదాలత్ కార్యక్రమం వలన కలిగే ప్రయోజనాలపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి సబిత, ఏఎస్పీ రామేశ్వర్, జిల్లా అబ్కారీశాఖ పర్యవేక్షణాధికారి గాయత్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం మీ చేతుల్లోనే!


- 55 శాతం విద్యార్థుల స్నాక్స్ డబ్బాల్లో జంక్ ఫుడ్
- తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలంటున్న వైద్యులు

ఈనాడు, మహబూబ్‌నగర్ -న్యూస్‌టుడే, కందనూలు


వనపర్తిలోని ఓ పాఠశాలలో అల్పాహారం తింటున్న ఎల్‌కేజీ చిన్నారులు

చిన్నారులు వాతావరణంలో చిన్న చిన్న మార్పులనే తట్టుకోలేరు. వాంతులు, విరేచనాలు, జ్వరం బారినపడి ఇబ్బందుల పాలవుతారు. ఉన్నపళంగా ఆస్పత్రికి పరుగెత్తితే వారం వరకు కోలుకోరు. అలాంటి వాళ్లకు ప్రమాదకరమైన జంక్ ఫుడ్ రోజూ పెడితే వారి లేత ప్రేగులు ఎలా తట్టుకుంటాయి.? వారి ఆరోగ్యం ఎంత ప్రమాదంలో పడుతుంది..? వారి భవిష్యత్తు ఏమవుతుంది? ఆలోచిస్తేనే భయమేస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది తల్లిదండ్రులు అలాంటి ఆహారమే పెడుతున్నారని 'ఈనాడు' ప్రాథమిక పరిశీలనలో తేలింది. ఇలా చేయటం పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి, భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.


వనపర్తిలోని ఓ ప్రైవేటు పాఠశాల చిన్నారుల అల్పాహారం



55 శాతం మందికి జంక్ ఫుడే : నేడు మూడు, నాలుగేళ్ల ప్రాయం నుంచే చిన్నారులను బడికి పంపిస్తున్నారు. ఉదయం 9 గంటల కల్లా వారు పాఠశాల్లో ఉంటున్నారు. ఉదయాన్నే తినే భోజనం కూడా ఉదయమే వండి పంపిస్తున్నారు. మధ్యలో తినడానికి చిరుతిళ్లు (స్నాక్స్) డబ్బాలో పెడుతున్నారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లా కేంద్రాల్లోని పాఠశాలల్లో 1,000 మంది చిన్నారుల చిరుతిళ్ల డబ్బాలు 'ఈనాడు' పరిశీలించగా 55 శాతం చిప్స్, చాక్లెట్లు, మైదా పదార్థాలతో కూడిన ప్రమాదకర ప్యాకేజ్డ్ జంక్ ఫుడ్, బిస్కెట్లు కనిపించాయి. ఉరుకుల పరుగుల జీవితంలో సమయం లేదని తల్లిదండ్రులు సులభమైన పనిగా ఇలా చేస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు అడిగితే పిల్లలు అవే తింటారని చెబుతున్నారు. 35.2 శాతం తల్లిదండ్రులు మాత్రం ఇంట్లో వండిన ఆరోగ్యకర ఆహార పదార్థాలు, చిరుతిళ్లు పంపించారు. మరో 9.8 శాతం మంది పిల్లలకు పండ్లను పంపించారు. మొత్తంగా 45 శాతం చిన్నారులకు మంచి ఆహారమే అందుతోంది.

గుర్తించినవి ఇవే..



అమలు కాని నిషేధం : నిబంధనల ప్రకారం ఐదో తరగతి లోపు చిన్నారులు ఉండే పాఠశాలల సమీపంలో చిప్స్, ఇతర జంక్ ఫుడ్ విక్రయించొద్దు. ఇది ఎక్కడా అమలు కావటం లేదు. పాఠశాలలకు ఆనుకొనే ఉన్న దుకాణాల్లో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు తల్లిదండ్రులు ఇచ్చే రూ.5, రూ.10తో జంక్ ఫుడ్ కొనుక్కుని తింటున్నారు.



నీటి గంట అవసరం : చాలా పాఠశాలల్లో విద్యార్థులు స్నాక్ డబ్బాతో పాటు నీటిసీసాలు తెచ్చుకుంటున్నారు. 80 శాతం చిన్నారులు భోజన సమయంలో మాత్రమే నీటిని తాగుతున్నారు. సీసాల్లో నీటిని అలాగే ఇంటికి తీసుకొస్తున్నారు. పాఠశాలల్లో నీటి గంట(వాటర్ బెల్) అమలు చేయాల్సిన అవసరముంది.



ఈ ప్రయత్నం బాగు : మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, జడ్చర్ల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి వంటి పట్టణాల్లోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు జంక్ ఫుడ్ తినకుండా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి. ఎవరైనా జంక్‌ఫుడ్ తెచ్చుకుంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్‌చేసి అవగాహన కల్పిస్తున్నారు.



ఇన్ఫెక్షన్లు, ఊబకాయం సమస్యలు : చిన్నారులకు జంక్ ఫుడ్ అలవాటైతే అన్నంపై ఆసక్తి చూపరు. జీర్ణ శక్తి తగ్గిపోతుంది. మాంసకృత్తులు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు అందక ఎదుగుదల లోపించి ఆరోగ్యం దెబ్బతింటుంది. జంకుఫుడ్‌లో నూనె, కలుషిత పదార్థాలు అధికంగా ఉంటాయి. వాటిని తినటం వల్ల పిల్లలకు నీళ్ల విరేచనాలు అవుతాయి. వయస్సు పెరిగే కొద్ది గ్యాస్, కడుపునొప్పి, ఊబకాయం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. తరచూ ఇన్‌ఫెక్షన్ల బారినపడి అస్వస్థతకు గురవుతారు.
- డా.బాల శ్రీనివాస్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి



పండ్లు, పోషకాహారం అవసరం.. : ప్యాకింగ్ ఆహారంలో గ్యాస్ ఉంటుంది. కవర్ వాసన వస్తుంది. బిస్కెట్లలో మైదా ఎక్కువగా ఉంటుంది. విటమిన్ నూనెలకు దానే తినేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. పిల్లలకు చిప్స్ ఇతర ప్యాకింగ్ ఆహారాన్ని స్నాక్స్ డబ్బాల్లో అస్సలు పెట్టొద్దు. ఐదో తరగతిలోపు చిన్నారులకు పండ్ల రసాలు, పండ్లు, క్యారెట్, కీరా, జావ, ఇంట్లో తయారు చేసే సంప్రదాయ అల్పాహారం పెట్టాలి. రక్తహీనత బారినపడకుండా పెద్ద పిల్లలకు పల్లీలు, బెల్లం చిక్కీలు, బాదం, పిస్తా, లడ్డూలు, ఉడకపెట్టిన గుడ్లు, పండ్లు అందించాలి.
- శైలజ, పోషకాహార కౌన్సిలర్, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

శ్రీశైలం నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల


శ్రీశైలం జలాశయం నుంచి 4 గేట్ల ద్వారా నీటిని వదులుతున్న దృశ్యం

శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ కృష్ణా నది ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెరుగుతుండటంతో శ్రీశైలం జలాశయం నాలుగు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువన ఉన్న జూరాల, హంద్రీ, సుంకేశుల జలాశయాల నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 1,18,464 క్యూసెక్కులు సుంకేశుల జలాశయం నుంచి 72,114 క్యూసెక్కులు హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరటంతో శ్రీశైలం కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాలతో పాటు స్పిల్ వే ద్వారా 1,79,971 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయంలో నీటి మట్టం 884.70 అడుగులకు, నీటి నిల్వ 213.8824 క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : డిగ్రీ కళాశాలలో అన్ని వసతులున్నా.. ఆశించిన స్థాయిలో నిర్వహణ లేదని అధ్యాపకులు వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకుని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కల్వకుర్తి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలను ఆయన తనిఖీ చేసి కళాశాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్పొరేట్ స్థాయిలో తరగతి గదులు, ల్యాబ్‌లు తదితర సౌకర్యాలున్నా నామమాత్రపు విధుల నిర్వహణతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించ లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి తరగతికి సంబంధించి సమయసారిణి రూపొందించుకుని అందుకు అనుగుణంగా బోధన జరగాలన్నారు. ల్యాబ్‌లు, తరగతి గదులను పూర్తిస్థాయిలో వినియోగించుకోక పోవడంతో దుమ్ము పేరుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం శౌచాలయాలు శుభ్రం చేయించక పోవడంతో దుర్వాసన వస్తోందని దాని వల్ల విద్యార్థులు అనారోగ్య బారిన పడే అవకాశం ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 900 మంది విద్యార్థులు చేరినా.. హాజరు అంతంత మాత్రమే ఉండటమేంటని నిలదీశారు. అధ్యాపకులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కళాశాలలో వసతులు, ఇతర సామగ్రిని సమకూర్చుతానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ల్యాబ్‌లు, తరగతి గదులు, వసతిగృహాలు పరిశీలించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శార్వాణీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీయూ ఉపకులపతి బాధ్యతల స్వీకరణ


ఇన్‌ఛార్జి వీసీ నదీం అహ్మద్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డా.జీఎన్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది మే 21 నుంచి ఉపకులపతి పోస్టు ఖాళీగానే ఉంది. లక్ష్మీకాంత్ రాథోడ్ తర్వాత రెగ్యులర్ ఉపకులపతి రాకపోవడంతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న నదీం అహ్మద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన నుంచి శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఉపకులపతి శ్రీనివాస్ పాలమూరు విశ్వవిద్యాలయానికి రానున్నారు.

అంతరిస్తున్న నల్లమల టేకు

పర్యవేక్షణ కరవై క్రమంగా తగ్గుతున్న వైనం


టేకు చెట్లు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : కలపలో రారాజుగా వెలుగొందిన నల్లమల టేకు చెట్లు అంతరించిపోతున్నాయి. గతంలో జిల్లాలోనే కొల్లాపూర్ నల్లమలలో విపరీతంగా టేకు చెట్లు ఉండేవి. పర్యావరణ పర్యవేక్షణ, సరైన నిఘా లేకపోవడంతో క్రమంగా నరికివేయబడుతున్నాయి. నాటి రజాకార్ల ఉద్యమం, మావోయిస్టుల సంచారం తదితర కారణాలతో ఈ ప్రాంతంలో అటవీ శాఖ అధికారుల నిఘా కరవైంది. అప్పటి నుంచి ఈ చెట్ల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. వన్యప్రాణులతో పాటు వివిధ రకాల చెట్ల జాతులు నల్లమలలో ఉంటేనే పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని పర్యావరణ ప్రేమికులు, నల్లమల, తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉన్న వాటిని కాపాడాలి...: ప్రస్తుతం కొల్లాపూర్ తీరంలోని అమరగిరిలో టేకు చెట్లు ఉన్నాయి. గట్ల వెంట, పొలాల్లో విస్తారంగా పెరిగాయి. సోమశిల, లోతట్టు ప్రాంతాలైన వేములపాయ, గుండ్లపెంట, ఎర్రకుంటం, తదితర ప్రాంతాల్లో అక్కడక్కడ ఉన్నాయి. అయితే ఉన్న వాటినైనా పరిరక్షించాలంటూ ప్రజలు కోరుతున్నారు. గతంలో హరితహారం పథకంలో భాగంగా అడవిలో వివిధ రకాల చెట్ల పెంపకం చేపట్టారు. కానీ టేకు చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మధ్యప్రదేశ్, బర్మా ప్రాంతాల నుంచి టేకు కలపను తీసుకొచ్చి ఇళ్లకు వాడుతున్నారు.

నిఘా పెట్టాం...: నల్లమలలో టేకు చెట్ల పరిరక్షణకు చర్యలు చేపడుతాం. ఉన్న చెట్లను కాపాడడానికి నిఘా పెట్టాం. అడవుల్లోకి ఎవ్వరూ ప్రవేశించకుండా శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నాం.
- చంద్రశేఖర్, రేంజ్ అధికారి, కొల్లాపూర్ అటవీ శాఖ

జియో ట్యాగింగ్ ఇవ్వాలి...

తెలంగాణ అడవుల్లో 45 జాతుల వృక్షాలు ఉన్నాయి. ఇందులో టేకు కలపకే డిమాండ్ ఎక్కువ. అందులోనూ నల్లమల టేకుకు మరీ ఎక్కువ. స్వాతంత్ర్యం పూర్వం ఇక్కడి టేకు కలపను ఇతర దేశాలకు తరలించారు. వీటితో ఇంగ్లాడులో రాజా ప్రసాదాలు నిర్మించారు. ఇప్పటికైనా నల్లమల టేకుకు జియో ట్యాగింగ్ ఇచ్చి పరిరక్షించాలి.
- డాక్టర్ కంటే శ్యాంసుందర్, బయోలాజిస్టు

జిల్లా వాసికి ఐఏఎస్‌గా పదోన్నతి


చంద్రశేఖర్‌రెడ్డి

అచ్చంపేట, న్యూస్‌టుడే : జిల్లాకు చెందిన గ్రూపు-1 అధికారికి ఐఏఎస్‌గా పదోన్నతి లభించింది. ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన కట్ట చంద్రశేఖర్‌రెడ్డి గ్రూపు-1 అధికారిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. హైదరాబాద్‌లో వివిధ శాఖల అధికారిగా బాధ్యతలు నిర్వహించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు ఐఏఎస్ అధికారిగా పదోన్నతి కల్పించడంతో ఉప్పునుంతల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పునుంతల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, నేతలు సీహెచ్ శ్రీను, శేఖర్ గౌడ్, కట్ట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.



- 'అబ్బబ్బా.. ఈ మధ్య పని ఎక్కువైంది. మా పిల్లలు తిన్న తర్వాత కంచం తీయరు. బడి నుంచి వచ్చి పుస్తకాల సంచి ఓ చోట, దుస్తులు మరోచోట పారేస్తారు. వాటిని సర్దాలంటే తల ప్రాణం తోక కొస్తోంది'.
అంటూ ఓ తల్లి పని మొత్తం చేస్తారు
- 'మా పాప డిగ్రీ చదువుతోంది.. ఇల్లు ఊడ్చదు. కంచంలోంచి కింద పడిన మెతుకులు తీయదు. మా వాడికేమో దుప్పటి మడతపెట్టడం రాదు. గదుల్లో లైట్లు ఆఫ్ చేయాలన్నా మా పనే..'
మరో మాతృమూర్తి ఇంటి పనంతా చక్కబెడతారు

ఇంత వరకు బాగానే ఉన్నా, వారిని మార్చాల్సింది.. కొంతలో కొంతైనా పని నేర్పాల్సింది కుటుంబ సభ్యులు.. తల్లే కదా!

ఆదివారం అమ్మకు తోడుగా..

న్యూస్‌టుడే-కొత్తకోట

సెలవుల్లో చరవాణులను పక్కన బెట్టి అమ్మకు సాయం చేద్దాం అనే భావన పిల్లల్లో కల్పించాలి. వారిలో తప్పని సరిగా మార్పు వస్తుంది. వారు కోరుకున్న వంట వారి చేతే చేయించండి. ఆ అనుభూతే వేరు. ప్రేమించడం తప్పు కాదు.. కాని, ఆ ప్రేమలో తెలియకుండానే సోమరితనంగా మారిస్తే జీవన నైపుణ్యాలు లేక పిల్లల ఉన్నతికి ప్రతి బంధకమవుతుంది. విద్య, ఉపాధి అవకాశాలకు గడప దాటినప్పుడు కొత్త వాతావరణంలో ఇమడలేక గందరగోళంలో పడతారని నిపుణుల హెచ్చరిక. బాల్యంలో ఇంటి పనులు నేర్పితే గృహ నిర్వహణలో ఆర్థిక, భౌతిక, సాంఘిక, భావోద్వేగ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని విద్యాశాఖ చెబుతుంది. 3 నుంచి 5వ తరగతులకు పని, విద్య నిర్దేశించిన అంశాల్లో ప్రస్తావించింది. వీటిని 'ఆదివారం' నుంచి ఆచరించడంలో పిల్లలను ప్రోత్సహిద్దాం.

బాధ్యత పెరుగుతుంది : సొంతంగా పనులు చేయడం వల్ల పిల్లల్లో బాధ్యత పెరుగుతుంది. వారిలో ధైర్యం, పట్టుదల, క్రమ శిక్షణవంటి లక్షణాలు అలవడుతాయి. వారిపై నమ్మకం ఏర్పడుతుంది. సేవాలక్షణాలు పెరిగి సమాజ సేవలో పాల్గొంటారు. ఇంట్లో అందరూ పనిచేయడం వల్ల కుటుంబమంతా కలిసి గడిపే నాణ్యమైన సమయం పెరుగుతుంది. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. మంచి చెడు పంచుకోవడంతో ఈ తరాన్ని వేధిస్తున్న ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన వంటివి దరి చేరవు.

పిల్లలతో ఇంటి పనులు చేయిద్దాం

(పని, విద్య పుస్తకంలో నిర్దేశించిన కృత్యాలు)
- ఉతికి ఆరేసిన దుస్తులను మడత పెట్టి భద్రపరచుకోవడం
- చెప్పులు, బూట్లను శుభ్రం చేసి క్రమపద్ధతిలో పెట్టుకోవడం
- విడిచిన దుస్తులు తల్లిదండ్రుల సలహా మేరకు వేయడం
- వినియోగ వస్తువులను, దుస్తులు, పుస్తకాలు, క్రమపద్ధతిలో అమర్చుకోవడం
- ఇంటి సరకులు తీసుకురావడంలో సాయం చేయడం
- నీళ్లు పట్టడం, ఇల్లు శుభ్రం చేయడం, వంట చేయడంలో సహకరించడం
- మొక్కలకు నీళ్లు పట్టడం, ఎరువులు వేయడం
- భోజనవేళలో తాగునీరు ఏర్పాటు చేయడం, కంచాలు తీసి కడగడం
- మరుగుదొడ్లను వినియోగించాక నీరు పోసి పరిశుభ్రంగా ఉంచడం



తల్లిదండ్రులదే బాధ్యత : పిల్లల్ని మీరు నిజంగా ప్రేమిస్తున్నట్లయితే వారితో తరచూ ఇంటి పనులు చేయించండి. వారికి బాధ్యతలను గుర్తు చేయండి. ఏ పని చేస్తున్నా బాగుంది.. ఇంకా వేగంగా.. మెరుగ్గా.. చేయగలవంటూ ప్రోత్సహించండి. వారి భాగస్వామం లేకుండా కుటుంబ పనులు పూర్తి కావని అర్థమయ్యేలా చెప్పండి. పిల్లల్ని ప్రేమించడంతో పాటు వారికి అన్ని నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత.
- శ్రీనివాసరాజు, మానసిక వైద్యనిపుణులు, మహబూబ్‌నగర్

చెత్తశుద్ధి కరవు!

రోడ్ల పక్కనే నిప్పుతో కాలుష్యం


కల్వకుర్తి పట్టణంలో చెత్తను వేరు చేస్తున్న సిబ్బంది


నాగర్‌కర్నూల్ : నల్లవెల్లి రోడ్డు పక్కన చెత్త కాల్చుతున్న దృశ్యం

కందనూలు, అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణాల్లో నిత్యం ఇంటింటి నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్త నిర్వహణ గాలికి వదిలేశారు. చెత్త సేకరణకు పురపాలక సంఘాలు ప్రతి నెల నిధులు ఖర్చు చేస్తున్నా.. ఆదాయం సమకూర్చుకోవడంపై దృష్టి సారించడం లేదు. ఇళ్ల నుంచి చెత్తను పట్టణ శివారు ప్రాంతాల్లోని డంపింగ్ కేంద్రాలకు తరలిస్తున్నా.. సంపదగా మార్చలేక పోతున్నారు. పుర అధికారుల నిర్లక్ష్యంతో సిబ్బంది చెత్తను దహనం చేస్తున్నారు. దీని వలన పురపాలక సంఘాలు ఆదాయాన్ని కోల్పోతున్నాయి. జిల్లాలోని కల్వకుర్తి మినహా మిగిలిన నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ పట్టణాల్లోని పురపాలకశాఖ సిబ్బంది చెత్తను కాల్చివేయడంపై స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రంలోనే నిర్లక్ష్యం.. : నాగర్‌కర్నూల్‌లో 18 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి మండల పరిధిలోని చందాయిపల్లి డంపింగ్‌యార్డుకు తరలించి చెత్తను వేరుచేయకుండా దహనం చేస్తున్నారు. ప్రతి రోజు ప్రధాన రహదారి, నల్లవెల్లి రహదారి పక్కన ఉన్న దుకాణాల నిర్వాహకులు రాత్రి సమయంలో కాగితపు చెత్తను దుకాణాల ముందు భాగంలో వేస్తున్నారు. వీటిని పురపాలక సిబ్బంది తెల్లవారు జామున పారిశుద్ధ్య పనులు చేస్తూ నల్లవెల్లి రహదారి పక్కన వేసి దహనం చేస్తున్నారు. డంపింగ్‌యార్డు వద్ద తడి, పొడి చెత్తను వేరు చేయడానికి ప్రత్యేక పునర్వినియోగ (రీ హ్యాబిటేషన్) కేంద్రం ఏర్పాటు చేయలేదు. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను కాల్చివేయడం వలన ఆదాయాన్ని కోల్పోడుతున్నారు. ● అచ్చంపేట పురపాలిక శివారు ప్రాంతంలోని చౌటబెట్ల గ్రామ సమీపంలో చెత్త దహనం చేస్తున్నారు. తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● కొల్లాపూర్ పట్టణం నుంచి సేకరించిన చెత్తను మండల పరిధిలోని అమగిరికి వెళ్లే రోడ్డు పక్కన డంపింగ్‌యార్డులో కాల్చుతున్నారు.

కల్వకుర్తి ఆదర్శం.. : కల్వకుర్తి పురపాలక సంఘం పరిధిలో తడి, పొడి చెత్తను వేరు చేసే బాధ్యత మహిళ సంఘం సభ్యులకు టెండర్ ద్వారా అప్పగించారు. చెత్తను వేరు చేసి హైదరాబాద్‌లోని ఓ కంపెనీకి విక్రయించడం ద్వారా ప్రతి నెల రూ. 2 లక్షల వరకు ఆదాయం వస్తోందని పురపాలక శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పురపాలక	వార్డులు	చెత్త సేకరణ వాహనాలు	నిత్యం తడి, పొడి, ఇతర చెత్త (మెట్రిక్ టన్నుల్లో..)
నాగర్‌కర్నూల్	24	13 ఆటోలు, ఒక ట్రాక్టర్	18
అచ్చంపేట	20	10 ఆటోలు, 2 ట్రాక్టర్లు	4
కొల్లాపూర్	20	-	6

టెండర్ ప్రక్రియ పూర్తి అయింది : నాగర్‌కర్నూల్ తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్తను విక్రయించే బాధ్యత మహిళ సంఘాల సభ్యులకు అప్పగిస్తున్నాం. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. చెత్తను కాల్చివేయకుండా చర్యలు తీసుకుంటాం. - మురళీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నాగర్‌కర్నూల్


కోడేరులో వర్షానికి వరి పంట పడిపోవడంతో చూపుతున్న బాధిత రైతులు

వర్షానికి నేలకొరిగిన వరి పంట

కోడేరు, న్యూస్‌టుడే : మండలంలోని నిర్విరామంగా కురుస్తున్న వర్షాలకు వరి పంటలు నేలకు ఒరుగుతుండటంతో ఆందోళన నెలకొంది. వారం రోజులుగా ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నాయి. కోడేరుతో పాటు ఎత్తం, నాగులపల్లి, పసుపుల, నర్సాయిపల్లి గ్రామాల్లో కొందరి రైతుల వరి పంట మడిలోనే కింద పడిపోయాయి. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో సర్వే చేయించి పంట నష్టపోయిన వారిని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కృష్ణాతీరం.. పర్యాటక సోయగం!



సోమశిలకు పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో వారాంతాల్లో ఇక్కడ సందడిగా ఉంటోంది. నదిని ఆనుకుని ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వచ్చేవారిని ఆకట్టుకునేలా కొత్త రిసార్టులు వెలుస్తున్నాయి. సోమశిలలో ఓ చోట కనిపించిన దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది. - ఈనాడు, మహబూబ్‌నగర్

హంగుల్లో తగ్గేదేలే!

హైదరాబాద్‌కు దీటుగా పాలమూరులోనూ గృహాలంకరణ



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే పోలీస్ ఉద్యోగి తన అభిరుచి మేరకు అద్భుతంగా ఇంటిని నిర్మించారు. 235 గజాల స్థలంలో రూ.1.60 కోట్లతో ఇంటిని సుందరంగా తీర్చిదిద్దారు. ఆ ఇంటిలోని ఓ గదిలో గోడకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన హంస బొమ్మ ఆకట్టుకుంటోంది. కేవలం ఆ బొమ్మ కోసమే రూ.42 వేలు ఖర్చు చేశాడు. ఇంటిలోని అంతర్గత నిర్మాణం కోసం రూ.16లక్షలు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయురాలు తన ఆసక్తి మేరకు 185 గజాల్లో రూ.1.40 కోట్లతో ఇంటిని నిర్మించుకున్నారు. ప్రతి గదిలో అందంగా ఆకట్టుకునేలా బొమ్మలు, ఇతర గృహోపకరణాలను వినియోగించారు. పడక గదిలో విభిన్నంగా విద్యుత్తు కాంతి వచ్చేలా అద్భుతంగా చిత్రాలు అమర్చారు. గృహాలంకరణకు దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ : ఓ ఇంట్లోని హోం థియేటర్

న్యూస్‌టుడే, పాలమూరు, కల్వకుర్తి

ఇల్లు కట్టుకోవటం ఓ కళ. అన్ని హంగులతో ఇంటిని ఏర్పాటు చేసుకొని చిరకాల వాంఛ తీర్చుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పట్టణాల్లో రహదారుల సుందరీకరణ, తదితర సౌకర్యాలు సమకూరుతున్నాయి. దీంతో రూ. కోట్లు ఖర్చు చేసి భవనాల నిర్మాణం చేసుకుంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు సమకూరుతున్నాయి. అయిదు జిల్లా కేంద్రాలతో పాటు మొత్తం 19 పురపాలికల్లో కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్ర రాజధాని నగరం 100 కిలోమీటర్ల పరిధిలోనే ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో హంగులతో సొంతింటికి మొగ్గు చూపుతున్నారు. అవసరాలు, అభిరుచుల మేరకు అధునాతన వసతులు, భవనాలను అద్భుతమైన రీతిలో నిర్మించు కుంటున్నారు.

● హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా గృహాలంకరణ నిపుణులను పిలిచి పనులు అప్పగిస్తున్నారు. గదుల్లో అలంకరణ, పడక, పూజ గదులను దేనికదే ప్రత్యేక సంతరించుకునేలా తీర్చిదిద్దుకుంటున్నారు. ఓపెన్ కిచెన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాన్య ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ఉన్నతోద్యోగులు, రాజకీయ నాయకుల ఇళ్లలోనూ ఆకర్షణీయ హంగుల కోసం ఖర్చుకు వెనుకాడటం లేదు.



కల్వకుర్తి : ఓ ఇంట్లో జిగేల్‌మనిపించే గది అలంకరణ



రూ.5 లక్షలతో నిర్మించిన అధునాతన వంట గది



చేతితో తాకే అద్దంలో వెలుగుతున్న విద్యుద్దీపాలు

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, చిత్రంలో ఎస్పీ, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ తదితరులు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్‌-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ పేర్కొన్నారు. శనివారం గద్వాలకు చేరుకున్న సీఎం కప్ క్రీడా జ్యోతికి సంగాల పార్కు వద్ద కలెక్టర్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గాంధీ చౌక్, పాతబస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, పీడీ పటేలు డీపీఎస్ రమునాథ్ చౌహాన్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం



దీక్షితకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ రచయితగా పాలమూరు జిల్లా కేంద్రంలోని దక్ష ఉన్నత పాఠశాల విద్యార్థినీ దీక్షితకు విజయం సాధించింది. ఈ మేరకు ఆ విద్యార్థినికి ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్ ప్రశంసాపత్రాన్ని అందించారు. రాష్ట్ర స్థాయిలో పాలమూరు విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచి బహుమతిని గెలిచినందుకు అభినందనలు తెలుపుతున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో సీఎంవో బాలుయాదవ్, డీఎస్‌వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే విలువిద్య పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల బాలికల జట్లను శనివారం మహబూబ్‌నగర్‌లోని బీఎస్ఏ మైదానంలో ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న విలువిద్య పోటీలకు ఈ జట్లను పంపడం జరుగుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, విలువిద్య కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి అండగా ఉంటా : కేటీఆర్

అయిజ, న్యూస్‌టుడే: అయిజ మండలం వెంకటాపూర్‌కు చెందిన వైద్య విద్యార్థి సుస్మితకు అండగా ఉంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన బుజ్జమ్మ, దేవదాసు దంపతుల కూతురు సుస్మిత నీట్‌లో ప్రతిభ చాటి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. తల్లిదండ్రులు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందిపడుతున్నారని కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. స్పందించిన కేటీఆర్ 'ఐ విల్ సపోర్ట్ పర్సనల్లీ' అంటూ 'ఎక్స్'లో సందేశం పెట్టడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



'ఎక్స్'లో కేటీఆర్ సందేశం

తృటిలో తప్పిన ప్రాణాపాయం



రైలు చక్రాల వద్ద ద్విచక్ర వాహనం

మానవపాడు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ దాటిస్తున్న క్రమంలో కర్నూలు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టిందని కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఏఎస్సై రమేశ్‌రెడ్డి తెలిపారు. పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్నాడు. శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద వర్షపునీరు నిలవడంతో సదరు వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ మీద దాటించేందుకు ప్రయత్నించాడు. ఇంతలో రైలు వచ్చేసింది. ద్విచక్ర వాహనాన్ని వదిలేసి రైతు సురక్షితంగా బయటపడ్డాడు. ద్విచక్రవాహనం కింద ఉండిపోవడంతో పది నిమిషాలు రైలు ఆగింది. దాన్ని ట్రాక్‌పై నుంచి తొలగించాక రైలు వెళ్లిపోయింది. లోకో పైలెట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

వేములలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



తలపడుతున్న మహబూబ్‌నగర్, గద్వాల జట్లు

అడ్డాకుల, న్యూస్‌టుడే: మూసాపేట మండలం వేముల గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 బాల బాలికల వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో గద్వాల జిల్లా, తృతీయ స్థానంలో నారాయణపేట జిల్లా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా, తృతీయ స్థానంలో గద్వాల జిల్లా జట్లు నిలిచాయి. ఈనెల 28న పెద్దపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గెలుపొందిన క్రీడాకారుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఒక జట్టును ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారులు శారదాబాయి, పాండు, జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, వడెన్న, జేపీఎన్‌సీఈ రవికుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

యువకుల గొడవ సీసీ ఫుటేజీ వైరల్

శిరోముండనంలో పోలీసుల పాత్రపై బలపడుతున్న అనుమానాలు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, లింగాల : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో ముగ్గురు యువకులకు శిరోముండనం చేసిన ఘటనకు ముందు జరిగిన గొడవ సీసీ కెమెరా ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ నెల 13న పెట్రోల్ బంక్‌లో గొడవ జరిగాక పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ముగ్గురికి శిరోముండనం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావటం, ఇందులో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తెలిసిందే. యువకుల మధ్య గొడవతోనే అతడు ఆత్మహత్యాయత్నం చేశాడని, పెట్రోల్ బంక్ వద్ద గొడవ, శిరోముండనం ఘటనలకు, తమకు సంబంధం లేదని పోలీసులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ యువకులు పెట్రోల్ బంకు వద్ద గొడవ పడిన సీసీ కెమెరా ఫుటేజీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో పోలీసులు కక్కలేని, మింగలేని పరిస్థితిలో పడిపోయారు. ఈ ఫుటేజీతో శిరోముండనం ఘటనలో పోలీసుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడి తల్లిదండ్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్న వీడియోలు బయటకు రావటంతో వారిపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు స్టేషన్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. అక్కడి ఫుటేజీలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్న చర్చ జరుగుతోంది.

ఇటీవలే ఇసుక వ్యవహారం రచ్చ.. : దుందుభి వాగులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు 10 రోజుల కిందట జిల్లాలోని నలుగురు ఎస్సైలను వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక వ్యవహారంలో ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులపై మచ్చ పడింది. ఈ వ్యవహారం మరవక ముందే లింగాలలో యువకుల శిరోముండనం ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసు శాఖ జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఘటనలపై విచారణ చేపడతామని, చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది కనిపించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నేతల ఒత్తిడితోనే జిల్లా అధికారులు ఈ వ్యవహారంలో ముందుకు వెళ్లలేకపోతున్నారని వినిపిస్తోంది.

వాహనం నుంచి జారిపడి బాలకార్మికుడి మృతి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో శనివారం ఉదయం వాహనం నుంచి జారి కింద పడి బాలకార్మికుడు (17) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చుక్కాయిపల్లి నుంచి తాడూరుకు పత్తితీత కోసం కూలీలు సుమారు పన్నెండు మంది బొలెరో వాహనంలో బయలుదేరారు. పెద్దకొత్తపల్లి దాటాక అదుపు తప్పి వాహనంపైన కూర్చున్న బాలుడు (17) కిందపడ్డాడు. తీవ్ర గాయాలవడంతో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలస్వామి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని జానంపేటకు చెందిన పాటిమిటి చిన్నరాజు, లలిత దంపతులు. ఆమెకు అదే గ్రామానికి చెందిన మధుగాని కురుమూర్తితో వివాహేతర సంబంధం ఉంది. 2019 మే 30న కురుమూర్తి జాతరకు భార్యాభర్తలు ఇద్దరు వచ్చారు. అక్కడికి ఆమె ప్రియుడు కూడా వచ్చాడు. భర్తకు మద్యం తాపించి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి టవల్‌తో గొంతుకు చుట్టి చంపేశారు. దీంతో మృతుడి అన్న అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం కేసు పరిశోధించి హత్యతో సంబంధం ఉన్నవారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. బెయిల్‌పై బయటికి రాగా తరువాత న్యాయస్థానంలో కేసు నడుస్తోంది, అందులో వాదోపవాదనలు విన్న కుటుంబ న్యాయస్థాన జడ్జి శ్రీదేవి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానాను విధించారు.

సస్యరక్షణ చర్యలకు సన్నద్ధం!



ప్రస్తుతం పంటలన్నీ పొట్టదశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు ఆశిస్తుండడంతో రైతులు పురుగు మందుల పిచికారీకి సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం పిచికారీ యంత్రాలకు అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నారు. యంత్రాల మెకానిక్‌లు కూడా తీరిక లేకుండా కనిపిస్తున్నారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద మరమ్మతుల కోసం రైతులు వరుసగా పెట్టిన పిచికారీ యంత్రాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ రన్నరప్



పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంటున్న మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ పోలీసులు సత్తా చాటారు. వీడియోగ్రఫీ విభాగంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి పోలీస్ అకాడమీలో మూడు రోజుల నుంచి జరుగుతున్న పోలీస్ డ్యూటీ మీట్‌లో ఉమ్మడి జిల్లా పోలీసులు ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పీసీ -1936 శ్రీనివాస్‌రెడ్డి వీడియోగ్రఫీలో, నారాయణపేట జిల్లాకు చెందిన ఏఆర్ పీసీ -3341 చంద్రశేఖర్ గౌడ్ వ్యక్తులను తనిఖీ చేయడంలో విశేషమైన ప్రతిభ చాటారు. వారికి వెండి పతకం వచ్చింది. దీంతో జోగులాంబ జోన్ పోలీస్ శాఖకు ఓవరాల్ రన్నరప్‌గా నిలవడంతో పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు తీసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ట్రోఫీని గెలిచిన వారికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి, నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్ అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

మేమున్నాం.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మీకు తోడుగా..

నాగర్‌కర్నూలు	7993300530
అచ్చంపేట	8008573927
కల్వకుర్తి	9908803650
కొల్లాపూర్	8008573870



? కంకర తేలి, వర్షపు నీరు నిలిచి, గుంతలు పడిన చౌటబెట్ల, తాళ్లనర్సింహాపురం దారి అధ్వానంగా మారింది. కొల్లాపూర్ పురపాలిక పరిధిలోని ఈ రెండు గ్రామాల మీదుగా చింతలపల్లి, పెంట్లవెల్లి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

- ఎల్లయ్య, తాళ్లనర్సింహ్మాపురం

✔ ఈ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతాం.

- విజయ్‌కుమార్, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ

– న్యూస్‌టుడే, కొల్లాపూర్



నాగర్‌కర్నూల్ : జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



నాగర్‌కర్నూల్ : విజేత విద్యార్థులతో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత, ఉపాధ్యాయులు



నాగర్‌కర్నూల్ : విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేస్తున్న ఎంఈవో భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు

వ్యాసం రాసి.. ప్రతిభ చాటి



నాగర్‌కర్నూల్ : పరీక్ష రాస్తున్న జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులు

కందనూలు, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు ప్రతిభ పోటీల్లో పాల్గొనడం వలన సామాజిక అంశాలపై అవగాహన ఏర్పడంతో పాటు మేధాసంపత్తి పెంపొందించుకోవచ్చని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'అంతర్జాలం వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు', 'విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానంలో షహనాకామ్ (10వ తరగతి), ద్వితీయ స్థానంలో ఓమేశ్వరి (9వ), తృతీయ స్థానంలో శృతి (9వ) నిలిచారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రథమ స్థానంలో కార్తిక (10వ), ద్వితీయ స్థానంలో దీపిక (10వ), తృతీయ స్థానంలో సానియాబేగం (9వ) నిలిచారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, జహీర్, బాల్‌రాజు, తిరుపతయ్య, నిర్మల, రజిత, హైమవతి, శారదమ్మ, షాహిన్ సుల్తానా, కల్పన తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

తెలకపల్లి, న్యూస్‌టుడే : ఈ నెల 16, 17 తేదీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర శిక్షక్ కళా ఉత్సవ్ -2024 పోటీల్లో మండల కేంద్రం శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ముకాభినయం పోటీల్లో జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థులు వినోద్‌కుమార్, భరత్, అజయ్‌గౌడ్, చరణ్‌తేజ్, జస్వంత్‌రెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సురేందర్‌రావు తెలిపారు. ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూత

అచ్చంపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక చేయూతను అందిస్తున్నామని క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి బంధం పరమేశ్వర ప్రసాద్ అన్నారు. శనివారం కొండనాగుల జడ్పీ ఉన్నత పాఠశాలలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు అభ్యసన సామగ్రిని పంపిణీ చేశారు. జీహెచ్ఎంలు విష్ణుమూర్తి, జీవన్‌కుమార్, నరేందర్‌రెడ్డి, క్లాస్‌మేట్ క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రాజు, గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : **దేవర**
రమణ : **వేట్టయన్ ద హంటర్**
కల్వకుర్తిలో.. పార్థసారథి : **దేవర**
అశోక్ : **వేట్టయన్ ద హంటర్**

కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 60, వంకాయ 45, బెండ 45, మిరప 48, కాకర 64, బీర 64, క్యాలిఫ్లవర్ 68, క్యాబేజీ 45, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 44, ఉల్లిగడ్డ 45, గోకర 64, దోస 44, ఆనంకాయ 18, చిక్కుడు 64, మునగకాయ 85, బీట్‌రూట్ 50, ఖీర, 44, బీన్స్ 98.

పెంచిన వేతనాలు చెల్లించాలి



నాగర్‌కర్నూల్ : పాత కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికుల రిలే దీక్ష

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని పురపాలక సంఘం అధికారులు పారిశుద్ధ్య కార్మికులకు బకాయిలు, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు శనివారం నుంచి సమ్మె చేపట్టి పట్టణంలోని పాత కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పురపాలక సంఘం కార్యాలయంలో కార్మికుల వేతనాల పేరుతో సిబ్బంది పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడినా ఉన్నతాధికారులు ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు జిల్లా కలెక్టర్ స్పందించి అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొదిల రామయ్య, గీత, లక్ష్మణ్, కార్మికులు భీముడు, వెంకట్‌రాములు, శేఖర్, భాను, రమేశ్, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం : సీపీఎం



మహా సభలో అభివాదం చేస్తున్న జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, నాయకులు

కోడేరు, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి పోరాటం చేసేందుకు ప్రజా సమీకరణ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. మండలంలోని రాజాపూర్‌లో శనివారం మూడో మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంతకముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల కార్యదర్శిగా పి.నరసింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు శివవర్మ, దశరథంనాయక్, రవి, వెంకటయ్య, రవి, వెంకటమ్మ, శివశంకర వరప్రసాద్, నిరంజన్ వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

అచ్చంపేట, న్యూస్‌టుడే : నల్లమల కొండలపై వెలసిన ప్రముఖ శైవక్షేత్రం ఉమామహేశ్వరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించాలని దేవస్థాన కమిటీ ఛైర్మన్ బీరం మాధవరెడ్డి కోరారు. శనివారం ఆయన మంత్రిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కొండ దిగువన భోగమహేశ్వరంలో కల్యాణ మండపం, పంచలింగాల ఆలయాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రతి రోజు కర్ణాటక, మహారాష్ట్ర తదితర దూర ప్రాంతాల భక్తులు హాజరవుతారని వసతులు కల్పించాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని మాధవరెడ్డి తెలిపారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

అమ్రాబాద్, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి డా.రజని అన్నారు. మండల ప్రత్యేకాధికారిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఆమె సమావేశమయ్యారు. గ్రామాలు, మండల కేంద్రం సమస్యల గురించి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక జడ్పీ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రహరీ, తాగునీటి సమస్యలను ప్రధానాచార్యులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అమ్రాబాద్‌లో జూనియర్ కళాశాలలో ప్రధానాచార్యులు, అధ్యాపకులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి డా. రజని

అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్ల పంపిణీ

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని మర్రిగుంతతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిగుంత కొత్తతండా మినీ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందజేసిన కోడి గుడ్లు కుళ్లి పోయి దుర్వాసన వస్తున్నాయని లబ్ధిదారులు వాపోయారు. ఈ కేంద్రంలో రెండు రోజుల క్రితం బాలింతలకు 15 గుడ్లు అందజేశారు. అవి ఏమాత్రం నాణ్యత లేకుండా ఉన్నాయని, వాటిని పగలగొట్టి చూస్తే కుళ్లిన స్థితిలో ఉండటంతో పడేశామన్నారు. అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు శంకరమ్మను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మర్రిగుంత కొత్త తండాలో కుళ్లిన కోడిగుడ్లు

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం



ఈదయ్య

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: ఇటీవల అమ్రాబాద్ మండలం మన్ననూర్ అడవుల్లో అదృశ్యమైన వ్యక్తి నాలుగు రోజుల తర్వాత వంగూరు మండలంలో ప్రత్యక్షమయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం శేరిపల్లికి చెందిన ఈదయ్య ఈ నెల 14న శ్రీశైలం వెళ్తున్నట్లు చరవాణి ద్వారా ఇంటికి సందేశాన్ని చేరవేసి సాయంత్రం 5.30 ప్రాంతంలో అదృశ్యమైన సంఘటన విధితమే. ఈదయ్య శనివారం తాగునీటి కోసం వంగూరు మండల సమీపంలోని కల్వకుర్తి-దేవరకొండ ప్రధాన రహదారిపై ఓ పెట్రోల్ బంక్‌లోకి వెళ్లాడు. మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిగా గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అమ్రాబాద్ పోలీసులు అతడిని అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఠాణాలో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో సంఘటనకు గల కారణాలు తెలుసుకున్నారు. ఇంటి నుంచి వెళ్లిన కొద్ది సమయానికి తన తలపై ఎవరో కొట్టినట్లుగా అనిపించడంతో వెంటనే కింద పడిపోయానని అప్పటి నుంచి తనకు గతం ఏం జరిగిందో, ఎక్కడికి వెళ్లానో, ఏమి తెలియడం లేదని ఈదయ్య చెప్పాడు. పూర్తిగా మతి స్థిమితం కోల్పోయినట్లు గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు సిఫారసు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై ఖాద్రీ, రమేశ్, సిబ్బంది తిరుపతయ్య పాల్గొన్నారు.

మొక్కజొన్న నిల్వలకు రైతుల అవస్థలు

లింగాల, న్యూస్‌టుడే: కష్టపడి పండించిన మొక్కజొన్న పంట దిగుబడి నిల్వ చేసుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నామని శనివారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో రెండు విశాలమైన గోదాంలు ఉన్నాయన్నారు. కల్లాలో ఆరబెట్టిన మొక్కలు కురుస్తున్న వర్షాలకు తడుస్తున్నాయని. మొక్కజొన్న ధాన్యం బస్తాల్లో నిలువ ఉంచుకోటానికి.. మార్కెట్ గోదాంలు వాడుకొనేలా అచ్చంపేట మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ చొరవ తీసుకొని స్పష్టమైన ఆదేశాలివ్వాలని రైతులు కోరుతున్నారు.



లింగాల: మార్కెట్ యార్డులో ఉన్న గోదాములు



కొల్లాపూర్‌లో భజరంగ్‌దళ్ కార్యకర్తల నిరసన

ఆలయాలపై దాడులు హేయం

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : హిందూ ఆలయాలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు పురేందర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో హిందూ వ్యతిరేక శక్తులు ఆలయాలపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. విగ్రహాలను ధ్వంసం చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిభరత్, మెంటె శివకృష్ణ, లక్ష్మణ్, రవి, మహేశ్, కార్తీక్, చిన్న, చరణ్, శ్రీకాంత్ శర్మ, మహేష్. సంపత్ పాల్గొన్నారు.

బస్సు ఘటనపై విచారణ

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : వెన్నచర్ల వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటనపై శనివారం నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసయాదవ్, ఆర్టీసీ డీఎస్పీ మహంకాళి రామ్మూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పెద్దకొత్తపల్లి ఠాణాలోనూ విచారించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎస్సై గోకారి, ఏఎస్సై బాలనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు రాంచంద్రయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించరూ

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కుడికిల్ల గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని భారాసవి జిల్లా నాయకుడు శేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5 గంటలకు తక్షణమే బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. సమయానికి బస్సు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అర్జున్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉమామహేశ్వర క్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని దేవాదాయ శాఖ ఏఈ బాలయ్య అన్నారు. శనివారం ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి శేషవస్త్రంతో ప్రధాన అర్చకుడు వీరయ్యశాస్త్రి సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. పంచలింగాల ఆలయంలో మిగులు పనులు, విగ్రహ ప్రతిష్ఠ, గాయత్రీ దేవి ఆలయ నిర్మాణం, నూతన మండపం, ప్రహరీ నిర్మాణ పనుల కోసం అంచనాలు తయారు చేస్తున్నామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మాధవరెడ్డి, కమిటీ సభ్యుడు వినోద్, ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరం ఆలయాన్ని దర్శించుకున్న దేవాదాయ శాఖ ఏఈ బాలయ్య

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యారంగ అభివృద్ధికి కేంద్రం 10 శాతం, రాష్ట్రం 20 శాతం నిధులు కేటాయించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యారంగ సమస్యలు - సవాళ్లు - కర్తవ్యాలు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాఘవచారి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించిందని, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు 12 శాతం నిధులు ఇచ్చినట్లు వివరించారు. విశ్వవిద్యాలయాల్లో దాదాపు 2 వేల ప్రొఫెసర్ ఉద్యోగాలు ఖాళీగా ఉండటంతో పాటు లక్షల్లో నిరుద్యోగులు ఉండటం విద్యా సంక్షోభానికి ఒక ఉదాహరణగా చెప్పారు. నారాయణమ్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 30 వేల పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు రెడ్డప్ప, సూర్యచంద్ర, హైమావతి, వెంకట్‌రాములు, పీసీఐ నాయకులు కొండన్న, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాములు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల సామగ్రికి రక్షణ కరవు

గోపల్‌దిన్నె జలాశయం నుంచి కొల్లాపూర్ పురపాలిక వరకు రూ.కోట్ల వ్యయంతో తాగునీటి పథకం నిర్మించారు. ప్రస్తుతం ఈ పథకం నిరుపయోగంగా మారింది. తాళ్లనర్సింహ్మాపురం, కొల్లాపూర్ శివారులో ప్లాస్టిక్ తాగునీటి పైపులను కోసుకొని తీసుకెళ్తున్నారు. ఈ ప్రాంతంలో ఇనుపపైపులు తస్కరణకు గురవుతున్నాయి. సోమశిల తాగునీటి పథకంలో పంపు మోటార్లు లేవు. సామగ్రి ఎత్తుకెళ్లారు. ట్యాంకు దగ్గర ఇనుపపైపులకు రక్షణ లేకపోవడంతో విడిభాగాలు తస్కరణకు గురయ్యాయి. కల్వకుర్తి పట్టణంలోని మంచినీటి బావుల దగ్గర మోటార్ల విడిభాగాలు, పైపులకు రక్షణ లేకుండా పోయింది.



సోమశిల తాగునీటి పథకంలో ట్యాంకు దగ్గర ఇనుపపైపుల దుస్థితి

● పురపాలిక కమిషనర్ శ్రీనివాసన్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి తాగునీటి పథకాల సామగ్రి రక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, కొల్లాపూర్

నిర్మాణ పనులు ఆపాలి

వెల్దండ, న్యూస్‌టుడే : హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై గల పెద్దాపూర్ గ్రామ శివారులోని గ్రీన్‌హోమ్ వెంచర్‌లో నిర్మాణ పనులను నిలిపి వేయాలని కల్వకుర్తి ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో నర్సిరెడ్డి అన్నారు. చెరువులో నిర్మాణ పనులు చేస్తున్నారని, అనుమతులు లేవని పెద్దాపూర్ గ్రామస్థుడు చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. వెల్దండ ఎంపీవో లక్ష్మణ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సైదమ్మ తదితరులు శనివారం సందర్శించి వివరాలు సేకరించారు. పనులు నిలుపాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా పంచాయతీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయనున్నామని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. ఈ నెల 27న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభ కరపత్రాలను శనివారం అచ్చంపేటలో ఆవిష్కరించి మాట్లాడారు. ఐక్యంగా ఉన్న ఎస్సీలను వర్గీకరణ పేరుతో వేరు చేయడం తగదన్నారు. రాజకీయ పార్టీలు వర్గీకరణ అంశాన్ని ఉపసంహరించుకునే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. నాయకులు ప్రభాకర్, ఆంజనేయులు, ఆనంద్, పాండు, విష్ణు, వెంకటయ్య, వెంకటేశ్, దేవేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యానికొచ్చి.. వృద్ధుడి అదృశ్యం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలో శుభకార్యానికి హాజరైన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్లకు చెందిన వెంకటేశ్వర్లు (75) ఈ నెల 18న అచ్చంపేటలోని మహేంద్రనగర్ కాలనీలో ఓ శుభకార్యానికి హాజరయ్యాడు. సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెదికారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం మనవడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై అబ్కారీ పోలీసుల దాడులు.. అయిదుగురిపై కేసు.. కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : సారా తయారీ కేంద్రాలపై శనివారం దాడులు నిర్వహించి అయిదుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు కల్వకుర్తి అబ్కారీ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎస్టీఎఫ్ హైదరాబాద్, మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, నాగర్‌కర్నూల్ డీటీఎఫ్, కల్వకుర్తి పోలీసుల ఆధ్వర్యంలో కల్వకుర్తి, తర్నికల్‌తండా, రెడ్యాతండా, జేపీనగర్ తండాల్లో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో 23 లీటర్ల సారా, 30 కిలోల పటికను స్వాధీనం చేసుకుని 820 లీటర్ల బెల్లం పాకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో సీఐలు బాలకృష్ణారెడ్డి, రాజలక్ష్మి, ఎస్ఐలు అరుణ, సతీష్‌రెడ్డి, బాల్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



తర్నికల్ తండాలో బెల్లం పాకం పారబోస్తున్న పోలీసులు

ఆటోలో తరలిస్తున్న బియ్యం పట్టివేత.. పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : పెద్దకొత్తపల్లి నుంచి కొల్లాపూర్‌కు ఆటోలో అక్రమంగా బియ్యం తరలిస్తుండగా శనివారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. 10 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని ఆటోను ఠాణాకు తరలించామన్నారు. బియ్యం గుర్తించేందుకు సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉప తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేయనున్నట్లు ఏఎస్సై బాలనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ పేర్కొన్నారు.

వేధించిన యువకుడికి జైలు శిక్ష.. కందనూలు, న్యూస్‌టుడే : ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన కేసులో ద్వితీయ శ్రేణి న్యాయస్థానం న్యాయమూర్తి రామయ్య నిందితునికి మూడు రోజుల పాటు జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించినట్లు షీటీం ఏఎస్సై విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. బిజినేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని వెలుగొండకు చెందిన శివకోటి తరచుగా ఫోన్ చేసి వేధిస్తుండగా బాధితురాలు షీటీంను ఆశ్రయించింది. విచారణ నిర్వహించి అతనిపై కేసు నమోదు చేసి పూర్తి వివరాలను న్యాయస్థానంలో అందజేసినట్లు చెప్పారు. న్యాయమూర్తి పరిశీలించి నిందితునికి మూడు రోజుల పాటు జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. షీటీంకు సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

జలాశయ పనుల వద్ద చోరీ.. కందనూలు, న్యూస్‌టుడే : పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా మండలంలోని కుమ్మెర వద్ద చేపడుతున్న వట్టెం జలాశయం పనుల వద్ద శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు టిప్పర్ వాహనాలకు సంబంధించిన రూ. 90 వేల విలువ కల్గిన పాత ఇనుప సామగ్రి చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం కంపెనీ నిర్వాహకుడు నాగేశ్వర్‌రావు గమనించి పట్టణంలోని ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

యువతలో దేశభక్తి పెంపొందాలి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : యువతలో దేశభక్తి పెంపొందాలని ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ కార్యవాహ పత్తికొండ రాము, భాజపా జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రారంభించి వందేళ్లు అవుతున్న సందర్భంగా శనివారం పెద్దకొత్తపల్లిలో స్వయం సేవకులు భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు పోల కిశోర్‌కుమార్, రాము, సుధాకర్‌రావు మాట్లాడారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధితులకు బాధ్యతగా సహాయ కార్యక్రమాలు చేపట్టి దేశభక్తి పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్‌రెడ్డి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయంసేవకులు

చరవాణి వాడకంపై విద్యార్థులకు అవగాహన

పెంట్లవెల్లి , న్యూస్‌టుడే : మండలంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఎస్సై రామన్ గౌడ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, చరవాణుల వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పలు అంశాలపై మెలకువలు బోధించారు. చరవాణులను విజ్ఞానం పెంపొందించుకోవడం, సమాచారం కోసం వినియోగించాలన్నారు. సామాజిక మాధ్యమాలకు బానిసలు కావొద్దన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏఎస్సై వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు నారాయణ, జ్యోతి, వాణి పాల్గొన్నారు.

బాలికలు చదువుకుంటేనే భవిత

వెల్దండ, న్యూస్‌టుడే: బాలికలు చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని, తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నతచదువులు చదివించాలని రాష్ట్ర కమ్యూనిటీ మోటివేషనల్ అధికారి జోషప్ అన్నారు. శనివారం వెల్దండ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, కస్తూర్బా విద్యాలయాల జిల్లా పర్యవేక్షకురాలు శోభరాణి, ఎంఈవో చంద్రుడు, ప్రిన్సిపల్ స్రవంతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ భారతమ్మ పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాల తరలించాలి

కందనూలు, న్యూస్‌టుడే : జిల్లాకు చెందిన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలను షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి తిరిగి నాగర్‌కర్నూల్ జిల్లాకు తరలించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయంనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలను ఇతర ప్రాంతాల్లో నిర్వహించడం వలన ఈ ప్రాంత విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, శ్రీను, రాజు, ఆనంద్, రాకేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు విడుదల చేయాలి

అమ్రాబాద్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల బకాయి ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం అమ్రాబాద్, పదర ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఈడీ అర్హతగల ఎస్జీటీ ఉపాధ్యాయులకు తక్షణమే పదోన్నతి కల్పించాలని అన్నారు. పీఆర్సీ గడువు ముగిసినందున వెంటనే కొత్త పీఆర్సీ అమలు చేయాలన్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో ఉద్యోగలుకు టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు సంఘం సభ్యత్వాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర బాధ్యులు పెంట్యా నాయక్, భరత్, భాస్కర్ రమేశ్, గోవర్ధన్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.